# పట్టాభిషేకం

శనివారం పొద్దున్నే ఎనిమిది గంటలకల్లా నేనూ మా ఆవిడా యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌వారి ఫ్రాంక్ ఎర్విన్ సెంటర్‌కి బయల్దేరాం. కావ్యకి ఒక గిఫ్ట్, గ్రీటింగ్ కార్డు, ఇంకో మూడు గ్రీటింగ్ కార్డులు పెట్టి రోడ్డెక్కాము.

పార్కింగ్ చేసి గబగబా లోపలికి వచ్చాం. అప్పుడే పట్టాలు తీసుకోవటానికి సిద్ధమయిన విద్యార్థులందరూ ఒకే లైనులో వచ్చి వాళ్ళకి నిర్ధారించిన కుర్చీల్లో కూర్చుంటున్నారు. నీలం గౌనులో తలమీద కేప్‌తో వస్తున్న కావ్య కనపడింది. కావ్యని చూసి చేతులు వూపాం. మమ్మల్ని చూసి సంతోషంగా చేయి వూపింది.

నేను ఇండియాలో పనిచేస్తున్నప్పుడు మంచి తెలుగు మిత్రుడు ఉండేవాడు. ఆయన కూతురే కావ్య. ఇండియాలో ఇంజనీరింగ్ డిగ్రీ తీసుకుని, ఆస్టిన్‌లో మాష్టర్స్ చేసింది. ఈ రోజే ఆమెకి పట్ట ప్రదానం.

ముందుకి వెళ్ళి కూర్చున్నాం. ఆస్టిన్‌లో యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ ఫ్రాంక్ ఎర్విన్ సెంటర్ పెద్ద ఆడిటోరియం. అక్కడ యూనివర్సిటీ బాస్కెట్ బాల్ ఆటలూ, మడొన్నా, స్టీవీ వండర్‌లాటివారి మ్యూజిక్ కాన్సర్ట్‌లు, బిల్ కాస్‌బ్డీలాటి వారి కామెడీ షోలూ, ఐస్ స్కేటింగ్, నాటకాలూ, సర్కస్ అన్ని రకాల కార్యక్రమాలూ సంవత్సరం పొడుగునా జరుగుతూనే వుంటాయి. అక్కడ కనీసం నలభై యాభై వేలమంది జనం పడతారేమో. కార్యక్రమాలని పట్టి, అక్కడ అరేంజ్మెంట్లు మారిపోతుంటాయి.

పక్కనే ఒంటరిగా కూర్చున్న అజయ్ పలకరింపుగా నవ్వాడు. అతన్ని నాలుగైదు సార్లు కలిశాను కానీ పెద్దగా స్నేహం ఏమీ లేదు.

యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ మ్యూజిక్ బ్యాండ్ సన్నగా సంగీతం వినిపిస్తున్నది. వారి వెనకాల టెక్సాస్ లాంగ్ హార్న్స్ బానర్ పెద్దది వున్నది. మన ఆంధ్రప్రదేశ్ లాగా టెక్సాస్‌కూడా వ్యవసాయరంగంలో ప్రపంచంలో అగ్రస్థానంలో వుంది. ఇక్కడి ఆవులకి పెద్ద కొమ్ములు ఎంతో పొడవుగా వుంటాయి. ఒక్కొక్క కొమ్ము దాదాపు మూడున్నర అడుగులు అరుదు కాదు. వాటినే టెక్సాస్ లాంగ్‌హార్న్స్ అంటారు. ఆ పేరుతోనే యూనివర్సిటీ బేస్ బాల్ టీం, ఫుట్ బాల్ టీం, బాస్కెట్ బాల్ టీం పిలువబడతాయి. ఆడవాళ్ళ టీము లేడీ లాంగ్‌హార్న్స్ అంటారు. ఫాకల్టీ మెంబర్లందరూ క్యూలో ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు వస్తున్నారు. మేమందరం లేచి నిలుచున్నాం. వాళ్ళందరూ స్టేజీ మీద కూర్చున్నాక మేమూ కూర్చున్నాం. ఇంతకుముందు మా అబ్బాయీ అమ్మాయీ యూనివర్సిటీ చదువులు ముగించుకున్నాక మేమీ కాన్వొకేషన్లకి వచ్చాం కానీ ప్రతిసారీ కొత్తగానే వుంటాయి. ఆరోజు జరుగుతున్నవి ఇంజనీరింగ్ కాలేజీ డిగ్రీప్రదానం మాత్రమే. అండర్ గ్రాడ్యుయేట్ స్కూల్‌లో బ్యాచిలర్ డిగ్రీలు తీసుకునేవాళ్ళూ, గ్రాడ్యుయేట్ స్కూల్‌లో మాష్టర్స్ డిగ్రీలు తీసుకునేవాళ్ళూ, పి.హెచ్.డి. చేసి డాక్టరేట్ తీసుకునేవాళ్ళూ వున్నారు. మేనేజ్మెంట్, లిబరల్ ఆర్ట్స్ లాటి కాలేజీలకి వేరే కాన్వొకేషన్లు వుంటాయి. మనం ఇండియాలో

కాన్వొకేషన్ అంటే అమెరికాలో కమెన్స్‌మెంట్ అంటారు.

డీన్ ఆఫ్ ఇంజనీరింగ్ స్వాగతం పలుకుతున్నాడు.

పక్కనే కూర్చున్న అజయ్ నాతో అంటున్నాడు, 'చూశారా ఎక్కడ చూసినా మన ఇండియన్సే. తరువాత చైనీస్. అమెరికన్స్ తక్కువ' అన్నాడు. నాకు ఆశ్చర్యం వేసింది అతని మాట విని. మనవాళ్ళూ ఓరియంటల్స్ చాలమంది కనపడుతున్నారు కానీ, వాళ్ళే ఎక్కువమంది అని నాకు అనిపించలేదు. అందుకే నవ్వి ఊరుకున్నాను.

ఒక ఆయిల్ కంపెనీ చీఫ్ ఎక్సిక్యుటివ్ ఆఫీసర్ ఆ రోజు కమెన్స్‌మెంట్ అడ్రస్ ఇస్తున్నాడు. ఆయన అప్పుడే చదువు పూర్తిచేసుకుని ఉద్యోగపర్వంలో అడుగు పెడుతున్న యువతీయువకులకి ఎంతో స్పందన యిస్తూ, వారి భవిష్యత్తు ఎలా తీర్చి దిద్దుకోవాలో, దానికి అమెరికన్ కార్పొరేట్ ప్రపంచం ఎలా సహాయం చేస్తుందో వివరంగా చెబుతున్నాడు. అదవగానే ముందు డాక్టరేట్ డిగ్రీ వచ్చినవాళ్ళని పిలుస్తు న్నారు. స్టేజ్ పక్కన మెట్ల దగ్గర అందరూ లైన్‌లో నుంచుని వాళ్ళ పేరు చదవంగానే స్టేజ్ మీదకి వచ్చి డిగ్రీ తీసుకుని వెనక్కి వెడుతున్నారు. వాళ్ళ స్నేహితులు రాగానే, ప్రేక్షకులలోనించీ పెద్దగా చప్పట్లూ, అరుపులతో ఆనందం వ్యక్తం చేసున్నారు. వారి తరువాత మాష్టర్స్ డిగ్రీ తీసుకునేవాళ్ళూ, తరువాత బాచిలర్ డిగ్రీల వాళ్ళూ. మెకానికల్ కెమికల్ ఎలెక్ట్రికల్ ఆర్కిటెక్చరల్ సాఫ్ట్‌వేర్.. అన్ని ఇంజనీరింగ్ బ్రాంచీల వాళ్ళు డిగ్రీలు తీసుకుంటున్నారు. కాకపోతే పేర్లు చదువుతున్న అసోసియేట్ డీన్ పరిస్థితి చూస్తే కొంచెం జాలివేసింది. ఆ రకరకాల పేర్లు చదవటం ఎవరికైనా కష్టమే. ఎనాంద్ స్రీనివసాన్, రయా హోఎబ్‌చంగ్, అష్రాఫీ ఖటిబ్‌లో, సివ్‌సెంకార బాలసుబ్‌రంయం, నబిత్ అల్మాడ్డిన్, అసుతోస్ సవ్‌అర్కర్, హోచి ట్రాన్..

'నేను చెప్పానుకదా. అందరూ మనవాళ్ళేనని.కాకపోతే కొంతమంది చైనీస్. అమెరికన్స్ తక్కువ' అన్నాడు అజయ్.

అతన్ని వింతగా చూశాను. 'అదేమిటి. అలా అంటారు. ఇది చూడండి' అని నా చేతిలో వున్న కమెన్స్‌మెంట్ బ్రోషూర్ అతనికి చూపించాను.

ఒకసారి దాన్ని అటూఇటూ తిప్పి 'చెప్పానుగా అంతా మనవాళ్ళూ, చైనీసే నని' మళ్ళీ నా చేతిలో పెట్టాడు. అతని మాటలతో నాకూ కుతూహలం పెరిగింది. నా ఇంజనీరింగ్ బుర్ర ఉపయోగించి గబగబా లెఖ్ఖలు కట్టాను. ఆరోజు డిగ్రీలు తీసు కుంటున్నవారు 1000 పైనే వున్నారు. మన ఇండియన్ పేర్లు 70 దాకా కనపడ్డాయి. చైనీస్ అంటానికి వీల్లేదుకానీ, ఓరియంటల్ పేర్లు 150 పైన వున్నాయి. ఓరియంటల్ అంటే చైనా తైవాన్ కొరియా వియత్నాం మొదలైన ఆసియా పసిఫిక్ దేశాలవారు అన్నమాట. తెల్లవాళ్ళూ, నల్లవాళ్ళూ చాలమంది వున్నారు. అతనితో ఆ విషయం మీద చర్చలు అనవసరం అని, ఆ లెఖ్ఖలు నాతోనే వుంచేసుకున్నాను.

మన భారతీయ విద్యార్థుల్లో బాచిలర్ డిగ్రీలు తీసుకునేవాళ్ళు నూటికి 99 పాళ్ళు భారతీయ అమెరికన్లు. పోస్టు గ్రాడ్యుయేట్, డాక్టరేట్ డిగ్రీలు తీసుకునే వాళ్ళల్లో ఇండియన్ ఇండియన్స్, ఇండియన్ అమెరికన్స్ ఇద్దరూ బాగానే కనిపిస్తారు.

ఈలోగా కావ్య పేరు పిలుస్తున్నారు, కావ్‌యా పిల్‌అలమారీ అని. కావ్య

డిగ్రీ తీసుకుంటుంటే నేను కొన్ని ఫొటోలు తీశాను. ఇలా పట్టభద్రులందరికీ పట్టాలు అందించిన తర్వాత ప్రొఫెసర్‌గారు ఆరోజు డిగ్రీలు తీసుకున్న వాళ్ళల్లో మొదటి స్థానాల్లో వున్నవారి పేర్లు చదువుతున్నాడు. ప్రతి పేరూ చదివినప్పుడు ఆ అమ్మాయో అబ్బాయో సీటు దగ్గరే లేచి నుంచుంటున్నారు. విద్యార్థి తల్లిదండ్రులనీ, అక్కడికి వచ్చిన బంధుమిత్రులనీ నుంచోమని చెబుతున్నాడు. వారికి సభాముఖంగా చప్పట్లు. అదవగానే మళ్ళీ ఇంజనీరింగ్ కాలేజీ డీన్ వచ్చి క్లోజింగ్ స్పీచ్ ఇచ్చాడు.

కొత్తగా పట్టభద్రులయినవారినందరినీ నుంచోమన్నారు. వాళ్ళు నుంచున్నాక, ప్రేక్షకులందరూ నుంచుని వారి కష్టానికి అభినందనలూ, వారి భవిష్యత్తుకి శుభాకాంక్షలూ చెబుతూ చప్పట్లు కొట్టారు. టెక్సాస్ లాంగ్‌హార్న్స్ మ్యూజిక్ బ్యాండ్ 'ది ఐసాఫ్ టెక్సాస్' అనే పాటని వాయించారు. ఆ పాట వాయిస్తున్నప్పుడు అందరూ లేచి నుంచున్నారు. పాటయాక ముందుగా ఫాకల్టీ మెంబర్లు ఒక లైనులో బయటికి వెళ్ళారు. తరువాత విద్యార్థులు వెళ్ళారు. అప్పటిదాకా నుంచున్న ప్రేక్షకుల వంతు తర్వాత.

మేము బయటికి వస్తుంటే కావ్య సెల్‌ఫోన్‌లో పిలిచింది, బయట ఫలానా చోట వున్నాను అంది. మేమూ అక్కడికే వస్తున్నాం అని బయటికి వచ్చాం. అప్పటికే మాకోసం ఎదురుచూస్తున్నది. కావ్యతోపాటూ ఆ అమ్మాయి రూమ్మేట్లు ఇద్దరూ కూడా ఆ రోజే డిగ్రీలు తీసుకుంటున్నారు. ముగ్గురి ముఖాలలో ఆనందం వెల్లివిరుస్తున్నది. ముగ్గురినీ అభినందించి, గ్రీటింగ్ కార్డులు ఇచ్చాం. కావ్య తెలుగులో అన్నది.

'ఈ సంతోషం చూడటానికి అమ్మానాన్నా లేరే అనుకుంటున్నాను. బిజీగావున్నా నా కోసం మీరు రావటం ఎప్పటికీ మరిచిపోను. చాల థాంక్స్' అంది.

'రాకపోతే ఎలా. మేం రాకపోతే నీకు డిగ్రీ ఇవ్వమన్నారే' అన్నాను. తనూ నవ్వింది. ఒక నార్త్ ఇండియన్ అబ్బాయి చేతిలో స్వీట్ల పాకెట్‌తో వచ్చాడు కంగ్రాట్యులేషన్స్ అంటూ. అందరికీ స్వీట్లు పంచిపెట్టాడు.

'ఏమిటి తరువాత కార్యక్రమం' అడిగాను.

'ఎవరన్నా ఉద్యోగం ఇస్తారేమో చూస్తాను. నాన్నేమో పెళ్ళిచేసుకోమంటున్నాడు. తరువాత సంగతి తరువాత' అంది.

స్టూడెంట్స్ యూనియన్‌లో షాంపైన్ టోస్టు కోసం అందరూ వెడుతున్నారు. వాళ్ళని ఆపటం మంచిది కాదని, అందరికీ కలిపి గ్రూప్ ఫొటోలు తీశాను.

కారులో ఇంటికి వస్తూ అన్నాను శ్రీమతితో - 'ఆ రోజుల్లో పట్టాభిషేకాలు వాళ్ళల్లో వాళ్ళే రాజులు చేసుకునే వాళ్ళు కానీ, అసలు పట్టాభిషేకం వీళ్ళది. అప్పులు చేసి ఎక్కడో ఇండియానించీ, దేశం కాని ఈ దేశం వచ్చి, త్వరగా కొత్త ప్రదేశానికీ మనుష్యులకీ చదివే పద్ధతికీ అన్నిటికీ అలవాటు పడటం, పార్ట్ టైం ఉద్యోగాలు చేసి కాస్త సంపాదించుకోవటం, తమ వంటలు తామే చేసుకోవటం, వాటన్నిటికీ మించి చదువులో చకచకా ముందుకి పోవటం - ఇదీ అసలు సిసలయిన పట్టాభిషేకం!'

0 0 0